

పారదర్శకంగా సేవలు
ఉద్యోగులు నీతి, నిజాయితీగా విధులు నిర్వర్తిస్తూనే పారదర్శకంగా సేవలందించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. 8లో

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (మంగళవారం సా॥) 6.23
సహర్ (బుధవారం ఉ॥) 5.03

వాతావరణం
గరిష్టం / కనిష్టం 37^{o} / 21^{o}
జిల్లాలో మంగళవారం ఉదయం నుంచే ఎండ ప్రభావం ఉంటుంది. మధ్యాహ్నానికి ఉష్ణోగ్రత పెరిగినా రాత్రి వరకు తగ్గుతుంది.

న్యూస్‌రీల్

రైల్వే బోర్డు చైర్మన్‌తో ఎంపీ వద్దిరాజు భేటీ



చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎంపీ రవిచంద్ర

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం జిల్లాకు సంబంధించిన పలు రైల్వే ప్రాజెక్టులు, ఇతర సమస్యలను రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర సోమవారం రైల్వే బోర్డు చైర్మన్ సతీష్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. ఢిల్లీలోని రైల్ నిలయంలో ఆయనతో భేటీ అయిన ఎంపీ ఇక్కడ రైల్వే సమస్యలను ప్రస్తావించారు. పలు స్టేషన్ల ఆధునికీకరణ, ప్లాట్‌ఫాంల విస్తరణ, కోవిడ్‌కు ముందు రద్దు చేసిన రైళ్ల పునరుద్ధరణ, ఇంకొన్ని స్టేషన్లలో హాల్టింగ్, కొత్త రైళ్ల మంజూరుపై చర్చించారు. ఈమేరకు సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని బోర్డు చైర్మన్ హామీ ఇచ్చారని ఎంపీ రవిచంద్ర తెలిపారు.

ఆయిల్‌పామ్ పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయండి

ఖమ్మంవన్‌టౌన్: ఉమ్మడి ఖమ్మం జిల్లా సహా తెలంగాణలో ఆయిల్‌పామ్ సాగు విస్తృతంగా ఉన్నందున కేంద్రప్రభుత్వం ఆధ్వర్యాన ప్రాంతీయ పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయాలని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి కోరారు. లోక్‌సభ సమావేశాల్లో భాగంగా సోమవారం ఆయన మాట్లాడుతూ పంటల వైవిధ్యీకరణలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహిస్తుండగా, ప్రస్తుతం 91,200హెక్టార్లలో ఉన్న సాగును ఏటా 40వేల హెక్టార్ల మేర విస్తరించాలనే లక్ష్యం ఉందని తెలిపారు. సుస్థిర వ్యవసాయానికి మద్దతు ఇస్తూనే నూనె ఉత్పత్తిలో స్వయం సమృద్ధి కోసం రైతులను ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. ఈనేపథ్యాన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ పామ్ ఆధ్వర్యాన ప్రాంతీయ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, తద్వారా రైతులకు మేలు జరుగుతుందని ఎంపీ వెల్లడించారు.

లైబ్రరీ భవనానికి రూ.2 కోట్లు

ఖమ్మంగాంధీచౌక్: జిల్లా కేంద్ర గ్రంథాలయ అదనపు భవన నిర్మాణానికి సోమవారం రూ.2 కోట్ల నిధులు మంజూరయ్యాయి. జిల్లా కేంద్రంలోని పెవిలియన్ గ్రౌండ్‌కు ఆనుకుని ఉన్న జిల్లా కేంద్ర గ్రంథాలయంలో అదనపు నిర్మాణాలకు రూ.2.80 కోట్లతో ప్రతిపాదనలు సమర్పించగా ఖమ్మం ఎమ్మెల్యే అయిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రూ.80లక్షలు కేటాయించారు. మిగతా రూ.2 కోట్లను రాష్ట్ర గ్రంథాలయ సంస్థ మంజూరు చేసింది. కాగా, జిల్లా లైబ్రరీ పాత పురాతన భవనం శిథిలమై 2024 జనవరి 13న కూలిపోయింది. కూలిన భవనం పక్కన మరో భవనం ఉన్నా పూర్తిస్థాయిలో సరిపోక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో పరిపాలనా విభాగాన్ని ఖమ్మం పాత మున్సిపాలిటీ భవనంలోకి మార్చారు. ప్రస్తుతం మంజూరైన నిధులతో నూతన భవనాలు నిర్మించనుండగా ఇక్కట్లు తీరనున్నాయి.

ఇంటర్ జవాబుపత్రాల మూల్యాంకనం

ఖమ్మం సహకారనగర్: ఇంటర్‌మీడియట్ వార్షిక పరీక్షలు ఓ పక్క కొనసాగుతుండగానే ఇప్పటికే పూర్తయిన పరీక్షలకు సంబంధించి జవాబుపత్రాల మూల్యాంకనం మొదలుపెట్టారు. ఖమ్మంలోని నయాబజార్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్పాట్ వాల్యుయేషన్ కేంద్రం ఏర్పాటుచేయగా వివిధ జిల్లాల నుంచి 20వేలకు పైగా సంస్కృతం జవాబుపత్రాలను పంపించారు. తొలిజు 24మంది అధ్యాపకులతో పాటు ఇద్దరు చీఫ్ ఎగ్జామినర్లు, ఇద్దరు అసిస్టెంట్ ఎగ్జామినర్లు విధులు నిర్వర్తించారని డీఐఈఓ రవిబాబు తెలిపారు. ఒక్కో అధ్యాపకుడు రోజుకు 15జవాబుపత్రాలు మూల్యాంకనం చేయాల్సి ఉంటుందని వెల్లడించారు.


398 మంది గైర్హాజరు

ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయని డీఐఈఓ రవిబాబు తెలిపారు. మొత్తం 17,078 మంది విద్యార్థుల్లో 398మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. కాగా, ఉన్నతాధికారుల ఆదేశాలతో ప్రతీ గదిలో గోడ గడియారాలు ఏర్పాటుచేశామని ఆయన తెలిపారు.

విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రచారం

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ సంబంధిత ప్రమాదాల బారిన పడకుండా ప్రజల్లో అవగాహనకు విస్తృత ప్రచారం చేస్తున్నట్లు ఎన్పీడీసీఎల్ ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి ఒక ప్రకటనలో తెలిపారు. డివిజన్ల వారీగా ఇందుకోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని పేర్కొన్నారు. రైతులు, వినియోగదారుల్లో అవగాహన పెంచడమే ఈ కార్యక్రమ లక్ష్యమని తెలిపారు. సమస్యలు ఎదురైనప్పుడు సొంతంగా మరమ్మతు చేయకుండా సిబ్బందికి సమాచారం ఇస్తే వెంటనే పరిష్కరిస్తామంటూ వివరిస్తామని వెల్లడించారు.

మారితే.. మనం ఎటు?!



అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన అంశం ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2008లో జరిగిన పునర్విభజనతో నియోజకవర్గాల రూపురేఖలు, రిజర్వేషన్లు మారిపోయాయి. కొన్ని స్థానాలు జనరల్ నుంచి రిజర్వ్‌లోకి, రిజర్వ్‌డ్‌గా ఉన్న స్థానాలు కొన్ని జనరల్‌కు మారాయి. అలాగే, తొమ్మిదిగా ఉన్న అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్య పదికి చేరింది. ఇక వచ్చే సాధారణ ఎన్నికల సమయానికి పునర్విభజన చేపట్టేలా కేంద్రప్రభుత్వం కసరత్తు చేస్తోందనే ప్రచారంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఏ నియోజకవర్గ పరిస్థితి ఎలా ఉంటుందోనని రాజకీయ విశ్లేషకులు అంచనాలు వేస్తున్నారు. అయితే, 2026 తర్వాత జనాభా లెక్కల అనంతరమే నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాలని చట్ట సవరణ చేయగా.. ఇప్పుడు ఈ ప్రక్రియపై ఎందుకు కసరత్తు జరుగుతోందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

– సాక్షి ప్రతినిధి, ఖమ్మం

అసెంబ్లీ, లోక్‌సభ స్థానాల పునర్విభజనపై పార్టీల్లో చర్చ

- చివరిగా 2008లో స్థానాల పునర్విభజన
- అప్పుడు తొమ్మిది నుంచి 10కి పెరిగిన అసెంబ్లీ సీట్లు
- రిజర్వేషన్లలోనూ మార్పులు
- ఈసారి పెంపు, రిజర్వేషన్లపై సర్వత్రా ఉత్కంఠ

ఇప్పుడే ఎందుకు?

పెరుగుతున్న జనాభా ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన చేపడుతుంటారు. తద్వారా నియోజకవర్గాల సంఖ్య పెరగడమే కాక సరిహద్దులు మారుతుంటాయి. ఇందుకోసం తొలిసారిగా 1963లో డీ లిమిటేషన్ కమిషన్ ఏర్పాటైంది. ఈ కమిషన్ పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి నియోజకవర్గాల సరిహద్దులు, రిజర్వేషన్లు నిర్ణయిస్తుంది. చివరిసారి 2008లో 2001 జనాభా లెక్కల ప్రకారం డీలిమిటేషన్ చేపట్టారు. ఆ సమయంలోనే 84వ చట్ట సవరణ ద్వారా 2026 తర్వాత జరిగే మొదటి జనాభా లెక్కల ఆధారంగా మరోమారు పునర్విభజన చేయాలని నిర్ణయించారు. ఈ నేపథ్యాన ఇప్పుడు పునర్విభజనకు సిద్ధం కావడాన్ని కొన్ని పార్టీలు తప్పుపడుతున్నాయి.

మారిన రిజర్వేషన్లు..

2008లో చేపట్టిన డీలిమిటేషన్ కారణంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నియోజకవర్గాల పరిధి, రిజర్వేషన్లలో మార్పులు చోటుచేసుకున్నాయి. తద్వారా కొందరు నేతలకు ఇబ్బంది ఎదురుకాగా, మరికొందరికి కలిసొచ్చింది. అప్పటి వరకు తొమ్మిది నియోజకవర్గాలు ఉండగా.. కొత్తగా అశ్వారావుపేట ఏర్పాటైంది. ఇందులో అశ్వారావుపేట, దమ్మపేట, చంద్రుగొండ, ములకలపల్లి, కుక్కునూరు, వేలేరుపాడు మండలాలు చేరాయి. రాష్ట్ర విభజన తర్వాత కుక్కునూరు, వేలేరుపాడు ఏపీలోకి వెళ్లగా.. ఇక్కడ కొత్తగా అన్నపురెడ్డిపల్లి మండలం చేరింది. ఇక బూర్గంపాడు నియోజకవర్గం రద్దయి ఆ స్థానంలో పినపాక చేరింది. అంతేకాక జనరల్ నియోజకవర్గమైన సుజాతనగర్ రద్దు కాగా.. ఆ స్థానంలో ఎస్టీ రిజర్వ్‌డ్‌గా వైరా నియోజకవర్గం ఏర్పడింది. అలాగే సత్తుపల్లి, మధిర నియోజకవర్గాలు జనరల్ నుంచి ఎస్సీ రిజర్వ్‌కు, ఎస్సీ రిజర్వ్‌డ్‌గా ఉన్న పాలేరు జనరల్ కేటగిరీలోకి వచ్చింది. ఈ క్రమంలో జనరల్ కేటగిరీలో కొత్తగూడెం, ఖమ్మం, పాలేరు మాత్రమే మిగిలాయి.

ఏం చేద్దాం.. ఎలా వెళ్దాం

నియోజకవర్గాల పునర్విభజన చర్చ మొదలవడంపై రాజకీయ పార్టీల నాయకులు దృష్టి సారించారు. ఒకవేళ డీలిమిటేషన్ జరిగితే తమకు బలమైన ఓటు బ్యాంక్ ఉన్న మండలాలు ఇతర నియోజకవర్గంలో కలిసే అవకాశం ఉందా అన్న అంశంపై ఆరా తీస్తున్నారు. అయితే నియోజకవర్గానికి ఎంత జనాభా ఉండాలనే అంశంపై స్పష్టత రాకపోవడంతో ఇంకొందరు వేచిచూసే ధోరణి అవలంబిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో పది అసెంబ్లీ స్థానాలకు గాను మూడు జనరల్‌గా ఉన్నాయి. ఈసారి పునర్విభజనపై పూర్తి వివరాలు వెల్లడి కాకపోవడంతో రిజర్వ్ స్థానాలు తగ్గుతాయా, పెరుగుతాయా.. రిజర్వేషన్లలో మార్పులు జరుగుతాయా, స్థానాల సంఖ్య పెరుగుతుందా అన్న అంశంపై అయోమయం నెలకొంది. కాగా, గత పునర్విభజన సమయాన కీలక నేతలు కొందరు సిట్టింగ్ స్థానాలు వదిలి ఇతరచోట్ల నుంచి పోటీ చేయాల్సి వచ్చింది. సుజాతనగర్ నుంచి రాంరెడ్డి వెంకటరెడ్డి పాలేరుకు వెళ్లగా, పాలేరులో పోటీ చేసి పలుమార్లు గెలిచిన సంభాని చంద్రశేఖర్, ఒకసారి గెలిచిన సండ్ర వెంకటవీరయ్య సత్తుపల్లికి, సత్తుపల్లి నుంచి తుమ్మల నాగేశ్వరరావు సైతం తమ కార్యక్షేత్రాన్ని మార్చారు. ఈసారీ ఇలాంటి పరిస్థితులే ఏర్పడతాయా అన్న అనుమానాలు నేతల్లో వ్యక్తమవుతున్నాయి.

రెండుగా ఖమ్మం..

ఈసారి చేపట్టనున్న డీలిమిటేషన్ విధివిధానాలు ఇప్పటివరకైతే బయటకు రాలేదు. ఒక్కో నియోజకవర్గానికి ఎంత మంది జనాభాను పరిగణనలోకి తీసుకుంటారో తేలాల్సి ఉంది. అయితే, డీలిమిటేషన్ చేపడితే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎన్ని అసెంబ్లీ నియోజకవర్గాలు పెరుగుతాయనే ఆసక్తి అందరిలో నెలకొంది. ఖమ్మంతో పాటు భద్రాద్రి జిల్లాలో 2001 జనాభా లెక్కలతో పోలిస్తే ఇప్పుడు పెరిగింది. గత పునర్విభజన సమయాన కొత్తగా అశ్వారావుపేట నియోజకవర్గం ఏర్పడింది. ప్రస్తుత జనాభాను పరిశీలిస్తే ఈసారి పునర్విభజనలో ఒక్క నియోజకవర్గమైనా పెరుగుతుందని పలువురు అంచనా వేస్తున్నారు. ప్రధానంగా ఖమ్మం నియోజకవర్గం జనాభా పరంగా రెట్టింపు అయినందున ఈ నియోజకవర్గం రెండుగా ఏర్పడే అవకాశమున్నట్లు చర్చ జరుగుతోంది.

దరఖాస్తు చేసుకుంటే స్థలాల రిజిస్ట్రేషన్

- రిజిస్ట్రేషన్ శాఖ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేయాలి
- ఎల్‌ఆర్‌ఎస్ అవగాహన సదస్సులో డీఆర్ రవీందర్



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్ రవీందర్

ఖమ్మంమయూరిసెంటర్: 2020 ఏడాదికి ముందు ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తులు చేసుకున్న వారి నుంచి నిర్ణీత రుసుము కట్టించుకుని రిజిస్ట్రేషన్ చేయనున్నట్లు జిల్లా రిజిస్ట్రార్(డీఆర్) ఎం.రవీందర్ తెలిపారు. ఖమ్మంలోని జెడ్పీ సమావేశ మందిరం, మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయాల్లో సోమవారం రియల్‌ఎస్టేట్ వ్యాపారులు, వెంచర్ల నిర్వాహకులతో వేర్వేరుగా సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్ మాట్లాడుతూ ఎల్‌ఆర్‌ఎస్‌ను రిజిస్ట్రేషన్ శాఖకు ఇటీవల ప్రభుత్వం లింక్ చేసిందని తెలిపారు. వెంచర్లలో 10 శాతం ప్లాట్లు రిజిస్ట్రేషన్ పూర్తయి, మిగిలిన వాటికి ఎల్‌ఆర్‌ఎస్‌లో దరఖాస్తు చేసి ఉంటే ఫీజులు కట్టించుకొని రిజిస్ట్రేషన్ చేస్తామని తెలిపారు. ఈమేరకు స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేయడమే కాక ఫీజు చెల్లించి, అండర్ టేకింగ్ ఇస్తే ప్రక్రియ పూర్తవుతుందని చెప్పారు. అంతేకాక 2020 ఆగస్టు 26కు ముందు ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకోలేకపోయినా వారి స్థలాలకు అన్నీ సక్రమంగా ఉంటే వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసి ఫీజు చెల్లించొచ్చని తెలిపారు. తద్వారా రిజిస్ట్రేషన్ చేస్తామని వెల్లడించారు. కాగా, కేఎంసీలో జరిగిన సమావేశంలో కమిషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారుల కోసం కార్యాలయంలో ఎనిమిదింటితో పాటు పన్నుల వసూళ్ల కేంద్రాల్లోనూ హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు వ్యక్తం చేసిన అనుమానాలను అధికారులు నివృత్తి చేశారు. అసిస్టెంట్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ఠ, సబ్ రిజిస్ట్రార్ టి.సంపత్‌కుమార్, జాయింట్ రిజిస్ట్రార్ ఎస్.రమా కిషోర్‌రెడ్డి, కేఎంసీ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ వసుంధర తదితరులు పాల్గొన్నారు.

మండుటెండల్లో బంతిపూల సోయగం



ఓ పక్క ఎండ మండిపోతుండగా సాగునీరు అందక వరి, మొక్కజొన్న తదితర పంటలు ఎండిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. అయితే, పెద్దసంఖ్యలో ముహూర్తాలు ఉండడంతో శుభకార్యాలు జరుగుతాయని.. తద్వారా బంతిపూలకు డిమాండ్ ఉంటుందని గ్రహించిన కొణిజర్లతో పాటు పల్లిపాడుకు చెందిన పలువురు రైతులు గత నెలలో బంతి సాగు చేశారు. ప్రస్తుతం తోటలు విరబూయగా పెళ్లిళ్లకు కేజీ రూ.50 చొప్పున విక్రయిస్తున్నారు. ఉగాది, శ్రీరామనవమి నాటికి ఇంకాస్త ధర పెరిగితే లాభాలు వస్తాయని రైతులు చెబుతున్నారు. – కొణిజర్ల

సమన్వయంతో పనిచేయండి

వీసీలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంసహకారనగర్: రబీ పంటలు ఎండిపోకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. హైదరాబాద్ నుంచి సీఎస్ శాంతికుమారితో కలిసి వారు సోమవారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఎక్కువ మొత్తంలో పంటలు ఎండిపోతున్నట్లు చూపే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఈనేపథ్యాన జల వనరులు, వ్యవసాయ, విద్యుత్‌శాఖల ద్వారా కలెక్టర్లు నివేదికలు తెప్పించుకుని పంటలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. చివరి ఆయకట్టుకు సైతం నీరందేలా పోలీసుల పహారా ఏర్పాటుచేయాలని తెలిపారు. అనంతరం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ వివిధ శాఖల అధికారులతో సమావేశమై సూచనలు చేశారు. జలవనరుల శాఖ ఎస్ఈలు వాసంతి, వెంకటేశ్వర్లు, డీఏఓ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎప్పటికప్పుడు పరిష్కరించాలి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- ప్రజావాణిలో దరఖాస్తుల స్వీకరణ

ఖమ్మం సహకారనగర్: ప్రజలు అందిస్తున్న ప్రతీ ఫిర్యాదును పరిశీలించి సత్వరమే పరిష్కరించేలా అధికారులు చొరవ చూపాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన ప్రజావాణిలో ఆయన అదనపు కలెక్టర్లు డాక్టర్ పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డితో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. ఒకసారి అందిన దరఖాస్తు రెండోసారి రాకుండా పరిష్కరించాలని, అలా సాధ్యం కాకపోతే కారణాలను వివరించాలని సూచించారు. ఈకార్యక్రమంలో డీఆర్‌ఓ పద్మశ్రీ, డీఆర్‌డీఓ సన్యాసయ్యతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని...

- ఖమ్మం రూరల్ మండలం మద్దులపల్లికి చెందిన పెందుర్తి కృష్ణవేణి కుమారుడు శ్యాంప్రసాద్ మృతి చెందిన నాలుగేళ్లకు ఆమె కూడా కన్నుమూసింది. దీంతో శ్యాంప్రసాద్ కుటుంబీకులు తప్పుడు ధ్రువపత్రాల ఆధారంగా ఐదెకరాల భూమిని బదలాయించుకున్నారని కృష్ణవేణి కుమార్తెలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.
- సింగరేణి మండలానికి చెందిన సయ్యద్ చాంద్ పాషా సర్వే నంబర్ 161లోని పట్టా భూమిలో 1981 నుంచి ఇల్లు కట్టుకుని ఉంటున్నందున స్థలాన్ని నిషేధిత జాబితా నుంచి తొలగించాలని కోరారు.
- జిల్లాలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయాలని, చివరి ఆయకట్టుకు నీరందేలా ఎన్నెస్పీ నీటిని ఏప్రిల్ చివరి వరకు విడుదల చేయాలని, సన్నధాన్యం అమ్మిన రైతులందరికీ బోనస్ జమ చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు బండి కృష్ణారెడ్డి, మందనపు రామారావు, మల్లెంపాటి రమేష్, పగడవరపు శ్రీనివాస్, తాళ్లూరి శ్రీనివాస్ తదితరులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

ఇద్దరం దివ్యాంగులమే...



దివ్యాంగులమైన మా ఇద్దరికి ఐదేళ్ల క్రితం వివాహం జరిగింది. ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకుంటే మొదటి జాబితాలో పేరు రాలేదు. ప్రత్యేక చొరవ తీసుకుని మాకు ఇల్లు మంజూరు చేయించాలి.

– నాగమణి – నాగేశ్వరరావు, చిన్నగోపతి

కుమారుడే ఇబ్బంది పెడుతున్నాడు



బ్యాంక్ రుణం తీర్చేందుకు ఇంటి స్థలాన్ని విక్రయించాలని యత్నిస్తే పెద్ద కుమారుడు అడ్డుకుంటున్నాడు. స్థానికంగా అధికారులను కలిసి విన్నవించినా ఫలితం లేదు. నా సమస్యపై కలెక్టర్ సారే స్పందించాలి.

– దంతాల భూదెమ్మ, రేపల్లెవాడ

కార్మికుల కష్టం కాజేస్తున్నారు..

కలెక్టరేట్‌లో క్లీనింగ్ ఏజెన్సీ బాధ్యులపై ఫిర్యాదు



కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు వినతిపత్రం ఇస్తున్న టీయూసీఐ నాయకులు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: నిబంధనల ప్రకారం కార్మికులకు ఇవ్వాల్సిన వేతనాల్లో కాంట్రాక్టర్ కోత విధిస్తున్నాడు. ఇదేమిటని అడిగితే విధుల నుంచి తొలగిస్తాడనే భయంతో పనిచేయాల్సి వస్తోందని కలెక్టరేట్‌లో క్లీనింగ్ సెక్షన్ కార్మికులు చెబుతున్నారు. 'ఎంత వేతనం వస్తుంది' అని కలెక్టర్ అడిగినా నోరు విప్పలేని పరిస్థితి ఎదుర్కొంటున్న వారి సమస్యలపై సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డేలో భారత కార్మిక సంఘాల కేంద్రం(టీయూసీఐ) నాయకులు ఆవుల అశోక్, పుల్లయ్య, కె.శ్రీను కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

వేతనాల్లో కోత.. అడిగితే బెదిరింపులు

కలెక్టరేట్‌లో క్లీనింగ్ కోసం ఏటా టెండర్లు పిలిచి తక్కువ కోట్ చేసిన వారికి అప్పగిస్తున్నారు. ఈ ఏడాది మహబూబాబాద్‌కు చెందిన సాయినాథ్ ఔట్ సోర్సింగ్ ఏజెన్సీకి కాంట్రాక్ట్ దక్కగా 20 మంది వరకు సూపర్‌వైజర్లు, వర్కర్లు పనిచేస్తున్నారు. సూపర్‌వైజర్‌కు రూ.19,500, వర్కర్‌కు రూ.15,600 వేతనంతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించాలి. కానీ వర్కర్‌కు రూ.7వేలు, సూపర్‌వైజర్‌కు రూ.14వేలే ఇస్తుండడంతో ఒక్కొక్కరు రూ.5వేల మేర ప్రతీనెలా నష్టపోతున్నారు. ప్రతిరోజు ఉదయం 10నుంచి సాయంత్రం 5 గంటల వరకు పని చేయాల్సి ఉండగా మంత్రుల సమీక్షలు, ఇతర సమావేశాలు ఉన్నప్పుడు అదనంగా పనిచేస్తున్నా లాభం ఉండడం లేదని చెబుతున్నారు. అంతేకాక తమకు రావాల్సినంత చెల్లించాలని కాంట్రాక్టర్‌ను అడిగితే పనిలో నుంచి తీసేస్తానని బెదిరిస్తున్నాడని వాపోయారు. ఈమేరకు ప్రజావాణిలో టీయూసీఐ నాయకులు ఆవుల అశోక్, పుల్లయ్య, కె.శ్రీను తదితరులు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు వినతిపత్రం అందజేసి గత మార్చి నుంచి ఇప్పటి వరకు వర్కర్లకు రావాల్సిన వేతనాలు ఇప్పించాలని కోరారు. ఈ విషయమై ఏఓ అరుణను వివరణ కోరగా మంగళవారం విచారణకు హాజరు కావాలని ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ బాధ్యులను సమాచారం ఇచ్చామని, విచారణలో తేలే అంశాల ఆధారంగా నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

రామయ్యకు ముత్తంగి అలంకరణ

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి మూలమూర్తులు సోమవారం ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చి కనువిందు చేశారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామిని తెలంగాణ ఉద్యోగ జేఏసీ కార్యదర్శి, టీజీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరు శ్రీనివాసరావు సోమవారం కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

క్లుప్తంగా

సంగమేశ్వరాలయంలో జిల్లా జడ్జి పూజలు



జిల్లా న్యాయమూర్తిని సత్కరిస్తున్న అర్చకుడు

ఖమ్మంరూరల్: మండలంలోని తీర్థాల సంగమేశ్వరాలయంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ దంపతులు సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఆలయ అర్చకులు వారికి స్వాగం పలికి పూజల అనంతరం తీర్థప్రసాదాలు అందించారు. అలాగే, ఆలయ చరిత్రను వివరించారు.

ప్రజా సమస్యలపై ఈనెల 20వరకు సర్వే

ఖమ్మంమయూరిసెంటర్: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈనెల 20వ తేదీ వరకు ఇంటింటి సర్వే చేయనున్నామని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర కావొస్తున్నా రుణమాఫీ, రైతు భరోసా, ఆత్మీయ భరోసా, గ్యాస్ సబ్సిడీ, 200యూనిట్ల ఉచిత విద్యుత్, రేషన్‌కార్డులు చాలా మందికి అందలేదని చెప్పారు. అలాగే, ఇందిరమ్మ ఇళ్ల పథకం ఎక్కడా ప్రారంభం కాక పోగా, సన్నధాన్యం అమ్మిన రైతుల్లో చాలామందికి బోనస్ జమ కాలేదని తెలిపారు. ఈమేరకు ఇంటింటా సర్వే ద్వారా సమస్యలు గుర్తించి వీటి పరిష్కారానికి మండల, మున్సిపల్ కేంద్రాల్లో ఆందోళనలు చేయనున్నట్లు నాగేశ్వరరావు చెప్పారు. కాగా, ఆరు గ్యారంటీల అమలుకు రానున్న బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని, భూభారతి చట్టాన్ని అమలు చేసి భూ సమస్యలు పరిష్కరించాలని, సాగర్ చివరి ఆయకట్టు వరకు నీరందేలా వారబందీ విధానాన్ని రద్దు చేయాలని, గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు యర్రా శ్రీకాంత్, వై.విక్రమ్, మాదినేని రమేష్, యర్రా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తాళం పగలగొట్టి చోరీ

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మండలం పాకలగూడెంలోని ఓ ఇంట్లో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. గ్రామానికి చెందిన రాచకొండ హరిబాబు ఇంటికి తాళం వేసి ఊరు వెళ్లగా, దొంగలు తలుపులు పగులగొట్టి లోనకు జొరబడ్డారు. ఆపై బీరువాలో దాచిన 12 గ్రాముల బంగారం, 30 గ్రాముల వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	7,375	5,800
కందులు	7,002	7,002
మిర్చి	14,000	6,000
మిర్చి తాలు	5,500	4,900
పత్తి	6,700	5,500

– ఖమ్మం వ్యవసాయం

సామాజిక బాధ్యత అవసరమే..

- నగరాల అభివృద్ధిలో కీలకంగా సీఎస్ఆర్ ఫండ్
- వలుచోట్ల ఈ నిధులతోనే పనులు
- ఖమ్మంలోనూ సంస్థలు ముందుకొస్తే ఫలితం

ఖమ్మంమయూరిసెంటర్: సామాజిక బాధ్యత కలిగిన వ్యాపార, వాణిజ్య సంస్థలు అందించే ఆర్థిక తోడ్పాటు నగరాభివృద్ధికి అండగా నిలవనుంది. సీఎస్ఆర్(కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బిలిటీ) ఫండ్‌తో ఇప్పటికే పలు నగరాల్లో అభివృద్ధి, సుందరీకరణ పనులు చేపడుతున్నారు. ఆర్థికంగా బలపడి ఆదాయ పన్ను చెల్లించే వారు సీఎస్ఆర్ ద్వారా సహకారం అందిస్తే మంచి ఫలితాలు వస్తాయని పూణే వంటి నగరాల్లో అభివృద్ధి తెలియచేస్తోంది. ఇటీవల పూణే నగరంలో కేఎంసీ బృందం పర్యటించిన సమయాన అక్కడి వ్యాపారులు, సంస్థలు, ఆదాయపన్ను చెల్లింపుదారులు పూణే మున్సిపల్ కార్పొరేషన్‌కు సీఎస్ఆర్ ద్వారా భారీగా విరాళాలు అందిస్తున్నట్లు గుర్తించారు. ఈ నిధులతో అక్కడి కార్పొరేషన్ అధికారులు ఒక ఆస్పత్రిని నిర్మించడం విశేషం. అంతేకాక నగరంలోని పలు కూడళ్ల సుందరీకరణ, నిర్వహణ పనులు చేస్తున్నట్లు అక్కడి అధికారులు వెల్లడించారు.

ప్రభుత్వ నిధులకు తోడుగా...

అభివృద్ధి చెందుతున్న పట్టణాలు, నగరాల్లో ప్రజల సామాజిక బాధ్యత, భాగస్వామ్యం కీలకంగా నిలుస్తోంది. ఖమ్మంలో ప్రస్తుతం ప్రజలు చెల్లించే పన్నులతో పాటు ప్రభుత్వం మంజూరు చేసే నిధులతోనే అభివృద్ధి పనులను చేపడుతున్నారు. వీటికి తోడు సామాజిక బాధ్యత కలిగిన వ్యాపార, వాణిజ్య సంస్థలు, పరిశ్రమలు, కార్పొరేట్ ఆస్పత్రులు, పాఠశాలల బాధ్యులు సీఎస్ఆర్ ఫండ్ అందజేస్తే మరికొన్ని పనులు వేగంగా చేపట్టేందుకు వీలవుతుంది. పూణే స్టడీ టూర్‌లో కేఎంసీ కార్పొరేటర్లు, అధికారులు సీఎస్ఆర్ ద్వారా అందుతున్న ప్రయోజనాలను తెలుసుకున్నారు. దీంతో ఖమ్మంలోనూ వ్యాపార, వాణిజ్య సంస్థలే కాక కార్పొరేట్ సంస్థలను అభివృద్ధిలో భాగస్వామ్యం చేయాలనే ఆలోచనలు మొదలుపెట్టారు. తద్వారా కేఎంసీకి నిధులు సమకూరి అభివృద్ధికి మెరుగైన అవకాశాలు ఏర్పడడమే కాక ఆయా సంస్థలకు ఆదాయపన్నులో రాయితీ లభించనుంది.



ఇటీవల కూడళ్ల అభివృద్ధికి ఉన్న అవకాశాలపై పరిశీలిస్తున్న కేఎంసీ కమిషనర్ అభిషేక్ అధికారులు

ప్రజలకు మెరుగైన సౌకర్యాలు

సీఎస్ఆర్ ద్వారా ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌కు నిధులు సమకూరితే ప్రజలకు అనేక సౌకర్యాలు కల్పించడం వీలవుతుందని అధికారులు భావిస్తున్నారు. ప్రధానంగా అంగన్‌వాడీ సెంటర్లు, అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లు, గ్రంథాలయాలు, కమ్యూనిటీ టాయిలెట్లు, పార్కుల అభివృద్ధి, యానిమల్ బర్త్ కంట్రోల్ యూనిట్, వాల్ పెయింటింగ్స్ కోసం ఈ నిధులను వినియోగించుకోవచ్చు. ప్రస్తుతం కేఎంసీకి వస్తున్న ఆదాయ పన్ను, ప్రభుత్వం మంజూరు చేసే వివిధ రకాల నిధులు ఉద్యోగులు, కార్మికుల వేతనాలు, చిన్నచిన్న అభివృద్ధి కార్యక్రమాలకే సరిపోతున్నాయి. కొన్ని సందర్భాల్లో నిధులు లేక పనులు ఆగిపోయిన సందర్భాలు ఎదురయ్యాయి. వీటన్నింటిని అధిగమించాలంటే దేశంలోని పలు మహానగర పాలక సంస్థలకు అందుతున్న విధంగానే ఖమ్మం నగరానికి సీఎస్ఆర్ ఫండ్ వస్తే బాగుంటుందనే చర్చ మొదలైంది.

అనేక అవకాశాలు

ఖమ్మం నగరానికి చెందిన పలువురు వ్యాపారులు సామాజిక బాధ్యతలు నిర్వర్తించడంలో ముందు వరుసలో నిలుస్తున్నారు. మున్నేటి వరద వంటి విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు వీరు స్పందించి ఇటు కలెక్టర్, అటు సీఎం రిలీఫ్ ఫండ్‌కు నిధులు సమకూరుస్తున్నారు. ఇతర పట్టణాలు, నగరాలతో పోలిస్తే ఖమ్మంలో సామాజికంగా సేవా కార్యక్రమాలు చేపట్టడం, అవసర సమయాన నిధులను అందజేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇలాంటి వారిని ఒప్పించి కేఎంసీకి సీఎస్ఆర్ ఫండ్ సేకరించగలిగితే వారికి యూటీ(యుటిలైజేషన్ సర్టిఫికెట్) అందుతుంది. తద్వారా ఆదాయ పన్నులో మినహాయింపు లభించనుంది. ఆపై ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధి, సుందరీకరణకు కీలకంగా నిలుస్తారు. ఇక్కడ కార్పొరేట్ ఆస్పత్రులు, పాఠశాలలు, బంగారు ఆభరణాల షోరూంలు, షాపింగ్‌మాల్స్ ఉన్నందున వీటి ద్వారా నిధులు రాబట్టవచ్చనే భావనకు వచ్చిన ప్రజాప్రతినిధులు ఆ దిశగా త్వరలోనే కార్యాచరణ మొదలుపెట్టే అవకాశముందని తెలుస్తోంది.

లింగ నిర్ధారణ కేసులో విచారణ

చింతకాని: గ్రామాల్లోకి కారులో యంత్రంతో వెళ్లి లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తూ ముగ్గురు పట్టుబడగా, నిందితులను వైరా ఏసీపీ కార్యాలయంలో విచారిస్తున్నారు. కేసులో ప్రధాన నిందితుడైన సల్లోజు వెంకటేష్ అలియాస్ ఆర్ఎంపీ చారిని సోమవారం చింతకాని పోలీసులు ఏసీపీ కార్యాలయానికి తీసుకెళ్లారు. ఆయనతో పాటు ఇదే కేసులో ఉన్న మనోజ్, కాత్యాయినిని సైతం పోలీసులు విచారించారు. లింగ నిర్ధారణ కేసులో వాస్తవాలను వెలికితీయడమేకాక ఇందులో ఎవరెవరి పాత్ర ఉందో తెలుసుకునేందుకు విచారణ చేపట్టినట్లు తెలిసింది.

పారదర్శకంగా సేవలు అందించాలి

జూనియర్ అసిస్టెంట్లకు శిక్షణలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మంసహకారనగర్: నీతి, నిజాయితీతో విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. ఖమ్మంలోని టీటీడీసీలో రెవెన్యూ శాఖ జూనియర్ అసిస్టెంట్లకు సర్వీస్ అంశాలపై ఏర్పాటుచేసిన రెండు రోజుల శిక్షణను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతిరోజు చేయాల్సిన విధులు, బాధ్యతలను పక్కాగా నిర్వర్తించేలా శిక్షణ ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రభుత్వం అమలుచేసే కార్యక్రమాలు, వివిధ పనుల కోసం జారీచేసే మార్గదర్శకాలపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. భూచట్టాలపై పట్టు సాధించి దరఖాస్తులను పరిష్కరించాలని, భూలావాదేవీల పరిష్కారంలో అవకతవకలకు పాల్పడొద్దని సూచించారు. అంతేకాక కుటుంబం, విధులను సమాంతరంగా నిర్వర్తిస్తే ఇబ్బందులు ఉండవని కలెక్టర్ తెలిపారు. అనంతరం రిటైర్డ్ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ సురేశ్ పొద్దర్, కలెక్టరేట్ పర్యవేక్షకులు టి.కరుణాకర్‌రెడ్డి, అధికారులు పలు అంశాలపై అవగాహన కల్పించారు.



పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్

ఈవీఎం గోదాం తనిఖీ

కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎంల గోదాంను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి సోమవారం తనిఖీ చేశారు. నియోజకవర్గాల వారీగా బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లు భద్రపరిచిన గదుల్లో పరిశీలించి భద్రతపై సూచనల చేశారు. ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ స్వామి, డీటీ అన్సారీ, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రాథమిక దశలో గుర్తిస్తే కళ్లకు రక్షణ



గ్లకోమాపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

ఖమ్మంవైద్యవిభాగం: తరచుగా కంటి పరీక్షలు చేయించుకోవడం ద్వారా తొలి దశలోనే గుర్తిస్తే గ్లకోమా బారిన పడకుండా కాపాడుకోవచ్చని ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్ తెలిపారు. ప్రపంచ గ్లకోమా వారోత్సవాల సందర్భంగా సోమవారం ఆస్పత్రిలో ప్రత్యేక కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ తెలియకుండానే కంటి చూపును దెబ్బతీసే గ్లకోమాపై అవగాహన అవసరమని చెప్పారు. కంటి వైద్య నిపుణులు రామూనాయక్ మాట్లాడుతూ వెలుతురు చుట్టూ రంగుల వలయాలు కనిపించడం, కంటి నొప్పి, దృష్టి కోల్పోవడం వంటి లక్షణాలే కాక కళ్లకు దెబ్బ తగిలినవారు, స్టెరాయిడ్ వాడేవారు, మధుమేహం, రక్తపోటు బాధితులు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. డిప్యూటీ సూపరింటెండెంట్ బి.కిరణ్‌కుమార్, కంటి విభాగం వైద్యులు ఆయేషాబేగం, సీనియర్ రెసిడెంట్లు రాజశేఖర్, ఆస్మా, శ్రావణి, ఆఫ్తాల్మిక్ అసిస్టెంట్లు వీణ, నరేష్, పాల్గొన్నారు.

అప్పు తిరిగి ఇవ్వలేదని ఇంటి రిజిస్ట్రేషన్?

ఖాళీ చేయించే విషయంలో ఇరువర్గాల నడుమ ఘర్షణ

ఖమ్మం అర్బన్: ఖమ్మం 14వ డివిజన్ మధురానగర్‌లోని ఓ ఇంట్లో నివాసముంటున్న వారిని బలవంతంగా కొందరు ఖాళీ చేయించారని డయల్ 100 ద్వారా ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే, తమ పేరిట రిజిస్ట్రేషన్ అయిన ఇంటిని ఖాళీ చేయాలని కోరినా వినడం లేదని మరోవర్గం వారు సైతం పోలీసులకు ఆశ్రయించిన ఘటన ఇది. సదరు ఇంట్లో నివాసముంటున్న దంపతులు ఓ అధికారి వద్ద వ్యాపార నిమిత్తం రూ.1.30కోట్ల అప్పు తీసుకుని తిరిగి చెల్లించలేదని సమాచారం. దీంతో సదరు అధికారి ఇంటిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తెలిసింది. దీంతో ఇల్లు ఖాళీ చేయాలని రిజిస్ట్రేషన్ కలిగిన వ్యక్తుల తరఫున కొందరు బలవంతంగా చొరబడి బయటకు పంపినట్లు చెబుతున్నారు. ఇంతలో కలగచేసుకున్న స్థానికులు సామరస్యంగా మాట్లాడుకోవాలని సూచించడంతో సదరు వ్యక్తులు వెళ్లిపోయినట్లు తెలిసింది. దీంతో అటు దంపతులు, ఇటు ఇంటి రిజిస్ట్రేషన్ కలిగిన వ్యక్తులు పరస్పరం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈవిషయమై ఖమ్మం అర్బన్ సీఐ భానుప్రకాశ్‌ను వివరణ కోరగా.. ఇదంతా సివిల్ వ్యవహారమని, దాడి విషయంలో ఫిర్యాదు అందితే కేసు నమోదు చేస్తామని తెలిపారు.

వైరల్ ఫీవర్‌తో వ్యక్తి మృతి



శ్రీనివాసరావు(ఫైల్)

పెనుబల్లి: మండలంలోని యడ్లబంజర్ గ్రామానికి చెందిన రైతు బన్నే శ్రీనివాసరావు (35) వైరల్ ఫీవర్ బారిన పడి మృతి చెందాడు. రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతున్న ఆయనను ఆదివారం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలింగా వైరల్ ఫీవర్‌గా నిర్ధారించి చికిత్స చేస్తుండగానే సోమవారం మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



జగ్గయ్య (ఫైల్)

నేలకొండపల్లి: రోడ్డుప్రమాదంలో గాయపడిన మండలంలోని ఆరెగూడెంకు చెందిన కొమ్మినేని జగ్గయ్య (86) చికిత్స పొందుతూ మృతి చెందాడు. నేలకొండపల్లి శివారులో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఆయనను హైదరాబాద్ తరలించారు. అక్కడ చికిత్స చేయిస్తుండగానే సోమవారం మృతి చెందాడు. జగ్గయ్యకు భార్య, ఇరువురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. గ్రామాభివృద్ధిలో కీలకంగా వ్యవహరించిన ఆయన మృతదేహం వద్ద మార్కెట్ చైర్మన్ వెన్నపూసల సీతారాములుతో పాటు శాఖమూరి రమేష్, వడ్డె జగన్, మార్తి సైదయ్య, కె.భాస్కర్‌రావు తదితరులు నివాళులర్పించారు.

స్నేహితుడి పెళ్లికి వెళ్లిన యువకుడు మృతి



పిట్ల మనీష్ (ఫైల్)

ఖమ్మంరూరల్: మండలంలోని బారుగూడెం పరిధి శ్రీసిటీకి చెందిన పిట్టల మనీష్(31) ఏపీలోని నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. శ్రీసిటీకి చెందిన పిట్టల సుధాకర్ – నిర్మల పెద్ద కుమారుడు మనీష్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ అక్కడే ఉంటున్నాడు. ఆళ్లగడ్డలో తన స్నేహితుడి వివాహానికి హాజరయ్యేందుకు ఆయన వెళ్లాడు. ఈక్రమంలోనే మరికొందరు స్నేహితులతో కలిసి కారులో వెళ్తుండగా ఆళ్లగడ్డ వద్ద సోమవారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదంలో మనీష్ మృతి చెందాడు. కాగా, ఆయనకు గత ఏడాది వివాహం జరగగా భార్యాభర్తలిద్దరు హైదరాబాద్‌లో ఉంటున్నారు. మనీష్ తండ్రి ఆర్టీసీలో ఉద్యోగం చేస్తున్నాడు. కాగా, మృతదేహం మంగళవారం స్వగృహానికి చేరుకుంటుందనే సమాచారం అందగా, మనీష్ మృతి చెందినట్లు తెలియడంతో కుటుంబీకులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

నీరు వృథా చేయకుండా వాడుకోండి

జల వనరుల శాఖ ఎస్ఈ వాసంతి



ఆళ్లపాడు మైనర్ వద్ద పరిశీలిస్తున్న ఎస్ఈ వాసంతి

బోనకల్: వారబందీ విధానంలో విడుదలవుతున్న సాగర్ జలాలను వృథా చేయకుండా పంటలకు ఉపయోగించుకోవాలని జల వనరుల శాఖ ఎస్ఈ వాసంతి రైతులను కోరారు. బోనకల్ బ్రాంచ్ కెనాల్ పరిధిలో చివరి ఆయకట్టుకు నీరందించే ఆళ్లపాడు మైనర్‌ను సోమవారం ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా ఆళ్లపాడు రైతులు వారబందీ విధానంలో కాకుండా పూర్తిస్థాయిలో నీరు విడుదల చేసి ఎండిపోతున్న పంటలను కాపాడాలని కోరారు. దీంతో స్పందించిన ఆమె ఆళ్లపాడు మైనర్‌కు ఎక్కువ మొత్తంగా నీరు విడుదల చేయాలని ఉద్యోగులను ఆదేశించారు. అలాగే, తహసీల్దార్ పున్నంచందర్ ఆధ్వర్యాన కాల్వపై అడ్డంకులను తొలగించగా రైతులు కృతజ్ఞతలు తెలిపారు. డీఈ తమ్మారపు వెంకటేశ్వర్లు, జేఈ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నిక్షిప్త చిట్‌ఫండ్ డైరెక్టర్లు అరెస్ట్

- ఖాతాదారులకు రూ.2కోట్లకు పైగా బకాయి

ఖమ్మంక్రైం: ఖమ్మంలో కొన్నేళ్లుగా ప్రైవేట్ చిట్స్ నిర్వహిస్తూ రూ.2కోట్లకు పైగా ఖాతాదారులకు చెల్లించని నిక్షిప్త చిట్‌ఫండ్ డైరెక్టర్లు సంగిశెట్టి కరుణాకర్, మూల ఉమామహేశ్వర్‌ను సోమవారం అరెస్ట్ చేసినట్లు ఖమ్మం టూటౌన్ సీఐ బాలకృష్ణ తెలిపారు. చీటీలు వేసిన 42మందికి రూ.2.17 కోట్లు చెల్లించకపోగా సెల్‌ఫోన్లు స్విచాఫ్ చేసిన డైరెక్టర్లు తప్పించుకుని తిరుగుతున్నారు. దీంతో మరిపెడ బంగ్లాకు చెందిన భూక్యా శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేయగా, ఖమ్మం వీడీవోస్ కాలనీలో ఉన్నారనే పక్కా సమాచారంతో సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

రైతులకు పరిహారం చెక్కులు

వేంసూరు: మండలంలోని కల్లూరుగూడెంలో పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మించనుండగా రహదారి కోసం పలువురు రైతుల వద్ద భూమి సేకరించారు. ఈమేరకు నిర్వాసితులు ఐదుగురికి సోమవారం ఆయిల్‌ఫెడ్ జీఎం సుధాకర్‌రెడ్డి పరిహారం చెక్కులు అందజేశారు. దాదాపు ఐదెకరాల భూమికి ఎకరాకు రూ.33 లక్షల చొప్పున పరిహారం అందజేసినట్లు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

పెనుబల్లి: మండలంలోని లింగగూడెం శివారు మామిడి తోటలో పలువురు పేకాట ఆడుతున్నారనే సమాచారంతో వీఎం బంజర ఎస్సై కె.వెంకటేష్ ఆధ్వర్యాన సోమవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఐదుగురు పట్టుబడగా రూ.9,280నగదు, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

300గ్రాముల గంజాయి స్వాధీనం

ఖమ్మంక్రైం: గంజాయి విక్రయిస్తున్న నలుగురిని సోమవారం అరెస్ట్ చేసినట్లు ఖమ్మం త్రీటౌన్ పోలీసులు తెలిపారు. భద్రాద్రి జిల్లా గాంధీనగర్‌కు చెందిన బానోతు అఖిల్, ఖమ్మం గుట్టలబజార్‌కు చెందిన ఈరపుల శ్రీకాంత్, ఖమ్మం గాంధీనగర్‌కు చెందిన గన్నా సంజయ్, శ్రీనివాస్‌నగర్‌కు చెందిన మునావత్ సురేష్ గంజాయి విక్రయిస్తుండగా పట్టుబడగా బంక పుల్లారావు పరారయ్యాడు. అరెస్ట్ చేసిన వారి నుంచి 300గ్రాముల గంజాయితో పాటు మూడు సెల్‌ఫోన్లు, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆటో బోల్తా, 14 మంది కూలీలకు గాయాలు

సత్తుపల్లిటౌన్: కూలీలతో వెళ్తున్న ఆటో అదుపు తప్పి బోలాపడడంతో 14 మందికి గాయాలయ్యాయి. కాకర్లపల్లికి చెందిన 14 మంది ఉపాధి హామీ కూలీలు సోమవారం ఉదయం సత్తుపల్లి తామర చెరువుమీదుగా కాకర్లపల్లి శివారులోని ఉపాధి పనులకు బయలుదేరారు. తామరచెరువు అలుగు వద్ద ఆటో కట్టపైకి వెళ్లే సమయాన అదుపు తప్పి పల్టీ కొట్టింది. దీంతో గాయపడిన కూలీలను 108లో సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించగా, తీవ్రగాయాలైన కె.పుల్లమ్మను ఖమ్మం తీసుకెళ్లారు. క్షతగాత్రులకు ఎంపీడీఓ నాగేశ్వరరావు, కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ పరామర్శించారు.

పసికందు విక్రయ కేసులో ముగ్గురికి జైలుశిక్ష

కొత్తగూడెంటౌన్: రెండు రోజుల మగ శిశువును విక్రయించిన కేసులో ముగ్గురికి మూడేళ్ల జైలుశిక్షతోపాటు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున జరిమానా విధిస్తూ సోమవారం జిల్లా రెండో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కె.సాయిశ్రీ తీర్పు చెప్పారు. తీర్పు వివరాలు ఇలా.. 2016లో కొత్తగూడెం మేదరబస్తీకి చెందిన నందబాల బాల వరలక్ష్మి, వెంకటేశ్వర్లు దంపతులు తమ రెండో కుమారుడు, రెండు రోజుల మగ శిశువును సిరిసిల్లకు చెందిన గాజుల రవీందర్‌కు విక్రయించారు. రూ. 80 వేలకు ఒప్పందం చేసుకోగా, అడ్వాన్స్ రూ.50 వేలు ఇచ్చి రవీందర్ పసికందును తీసుకెళ్లాడు. విషయం తెలియడంతో అప్పటి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పయ్యావుల రమాదేవి కొత్తగూడెం త్రీటౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. తొమ్మిది మంది సాక్షులను విచారించిన న్యాయమూర్తి ముగ్గురికి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.విశ్వశాంతి వాదించగా, సీఐ శివప్రసాద్, నోడల్ ఆఫీసర్ జి. ప్రవీణ్‌కుమార్, సిబ్బంది అబ్దుల్ ఘని, బి.శోభన్ సహకరించారు.